

భక్తిశ్రద్ధలతో 'బండిషిడి'

బండిషిడికి వేలాడుతున్న భక్తుడు

నారాయణఖేడ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌లో మల్లన్నజాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండిషిడి ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అకాడమీ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి ఉన్నారు. గ్రామంలో ప్రతీ సంవత్సరం దత్తాత్రేయ జయంతి సందర్భంగా మల్లన్న జాతర, బండిషిడి నిర్వహిస్తారు. బండికి పొడుగాటి కర్రను అమర్చి, దాని చివరన ఓ భక్తుడు వేలాడుతూ ప్రజలపై స్వామివారి కుంకుమ, పసుపు, వేపాకును చల్లుతుంటాడు. ఇలా బండిని గుడి చుట్టూ ఐదు సార్లు తిప్పుతారు. ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు.



మల్లన్న ఆలయంలో బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి

సంగారెడ్డి సీఎస్ఐ చర్చి జాతరలో జగ్గారెడ్డి

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్



సంగారెడ్డిలోని సీఎస్ఐ చర్చి జాతరలో పాల్గొని మాట్లాడుతున్న జగ్గారెడ్డి



జాతరకు హాజరైన ప్రజలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అందరికీ అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరు సంతోషంగా క్రిస్మస్ పండుగ జరుపుకోవాలని కోరారు.

'శివ్వంపేట మండలం ఉసిరికపల్లి చౌరస్తాలో ఈ నెల 9న పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వాహనంలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల్లో కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేసి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు'.

'టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి వద్ద ఈ నెల 10న డీసీఎం వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత నెలలోనూ ఇదే గ్రామంలో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. జాతీయ రహదారి కావడంతో అక్రమంగా బియ్యాన్ని రాష్ట్రం దాటిస్తున్నారు.'

'పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలో అక్రమంగా నడుపుతున్న ఓ రైస్‌మిల్లులో 500 టన్నుల రేషన్ బియ్యాన్ని కొద్దిరోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. సంచులలో ప్యాకింగ్ చేసి, ఎఫ్‌సీఐ మార్కును ముద్రించి అడ్డదారిలో విక్రయించడానికి సిద్ధం చేస్తుండగా విషయం వెలుగులోకి వచ్చింది'.

'ఝరాసంగం మండలంలో రేషన్ బియ్యం సేకరించడానికి దళారులు ఏకంగా కూలీలను నియమించుకున్నారు. వారు ప్రతీరోజు గ్రామాల్లో తిరిగి దాకా బియ్యం సేకరిస్తున్నారు.'

దొడ్డు బియ్యం.. అడ్డదారి

- బ్రోకర్లకు విక్రయిస్తున్న తెల్లకార్డుదారులు
- పల్లె, పట్టణాల్లో బహిరంగంగానే వ్యాపారం
- జిల్లా నుంచి పక్క రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి
- ఇటీవల కాకినాడ పోర్టులో పట్టుబడిన లారీలు
- అమ్మకాల్లో ఎవరి వాటా వారిదే
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 15: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నది. రేషన్‌షాపుల్లో ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని సరిహద్దులు దాటించి విక్రయిస్తున్నారు. ఈ దందాలో రేషన్ లబ్ధిదారుల నుంచి జిల్లాల సరిహద్దులు దాటించేవరకు భాగస్వాములైన వారందరూ లాభపడుతున్నారు. కొందరు ఏకంగా కోట్లాది రూపాయలు వెనకేస్తున్నారనే చర్చ జరుగుతోంది.



పాశమైలారంలోని ఓ రైస్‌మిల్లులో నిల్వచేసిన రేషన్ బియ్యం

ప్రతీ నెల 1 నుంచి 15 వరకు రేషన్ దుకాణాల్లో ఉచితంగా బియ్యం ఇస్తుంటారు. పంపిణీ ప్రారంభం కాగానే దళారులు వాలిపోతున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ.12 వరకు అందజేసి అక్కడికక్కడే కొంటున్నారు. దొడ్డు బియ్యం కావడం, ఉచితంగా వచ్చిన బియ్యానికి డబ్బుల వస్తుండడంతో తెల్లకార్డుదారులు సైతం ఎగబడి విక్రయిస్తున్నారు. మోటార్ సైకిళ్లు, ట్రాలీ ఆటోలతో వచ్చి బహిరంగంగానే తూకం వేస్తున్నారు. ఈ విషయం పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఏదైనా సమాచారం ఉన్నపుడు మాత్రం ఆటోలు, వ్యాన్లను స్వాధీనం చేసుకుంటున్నారు.



మాసాయిపేట మండలం రామంతపూర్‌లో బియ్యం తీసుకువెళ్తున్న ట్రాలీ ఆటో



ఝరాసంగంలో మోపెడ్‌లపై తరలిస్తున్న రేషన్ బియ్యం

గల్లీగల్లీలో దళారులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సేకరించిన బియ్యాన్ని దళారుల ద్వారా పలువురు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. వ్యవస్థలోని అన్నిస్థాయిలవారిని మేనేజ్ చేస్తూ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. ఇలా మెదక్ జిల్లా బొడ్మట్‌పల్లి వద్ద దళారులు ఓ పాయింట్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తున్నది. పెద్దశంకరంపేటలోనూ ఓ బడా వ్యాపారి పాత్రపై చర్చ జరుగుతోంది. నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో కొందరు దళారులు సెంటర్లు తెరవగా గ్రామాలు, పట్టణాల్లో కొనుగోలు చేసిన బియ్యాన్ని బ్రోకర్లు ఈ కేంద్రాల్లో అప్పగిస్తున్నారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు తరలించడానికి నారాయణఖేడ్ ప్రాంతాన్ని సరైన పాయింట్‌గా ఎంచుకున్నారు. ఆయా రాష్ట్రాల్లో కిలోకు రూ.30 చొప్పున కూడా ఈ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. అంతేగాకుండా స్థానికంగా కోళ్లఫారాల్లో దాణాగానూ వినియోగిస్తున్నారు. దళారులు తమ వ్యాపారం నిరాటంకంగా సాగించేందుకు



చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం

మిగతా 8వ పేజీలో

'హైడ్రా'తో కూల్చుడే తప్ప కట్టింది లేదు

- అల్లుఅర్జున్, లగచర్ల రైతుల అరెస్ట్‌తో హిట్‌వికెట్ అయిన రేవంత్
- రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకని దుస్థితి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

6



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎస్టీపీ ఏర్పాటును అడ్డుకుంటాం

పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ 465 ఎకరాలుగా నిర్ణయిస్తే ప్లాట్లకు బదులు స్థలాలివ్వాలి

ఎల్లమ్మగుడి వద్ద ముంపు బాధితుల ఆందోళన

పటాన్‌చెరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటును అడ్డుకుంటామని ముంపు బాధితులు హెచ్చరించారు. పెద్దచెరువు ప్లాట్ల ముంపు బాధితులు ఆదివారం వాణినగర్ ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. చెరువును శుద్ధిచేసే పేరిట ఎఫ్‌టీఎల్ పరిధిలోని ప్లాట్లలో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు కొందరు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. 20 లేఅవుట్ల పరిధిలోని 5వేల మంది ప్లాట్ల యజమానుల జీవితాలతో చెలగాటమాడవద్దని కోరారు. రికార్డుల్లో 93.15 ఎకరాలు మాత్రమే ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిని దొడ్డిదారిన 465 ఎకరాలకు పెంచారని ఆరోపించారు. ప్రభుత్వం ఇదే ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తే 5వేల మంది ప్లాట్ల యజమానులకు అమీన్‌పూర్‌లోనే భూమికి బదులు భూమిని పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని విన్నవిస్తామన్నారు. ఆందోళనలో రైతు రామిరెడ్డి, ప్లాట్ల బాధితుల సంఘం జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ, సభ్యులు రవి, బ్రహ్మానందరావు, విజయ్‌కుమార్‌రెడ్డి, టీఈ రావు, సంజయ్‌కుమార్, పుండరీకాక్షశర్మ, సురేష్‌చౌదరి, జీవా, ఎంఎస్ బాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆంజనేయరాజు, సత్యమూర్తి, రమేష్, ఏపీ రావు, ప్రతాప్, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.



వాణినగర్ ఎల్లమ్మ ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న పెద్దచెరువు ముంపు బాధితులు



తెల్లవారుజామున వెల్దుర్తిని కమ్మేసిన పొగమంచు

కనిష్ట ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లా.. కోహీర్‌లో 6.8, న్యాల్కల్‌లో 6.9, మల్‌చెల్మ, నల్లవల్లిలో 8.3, సిర్గాపూర్, ముక్తాపూర్‌లో 8.4, నిజాంపేట, అల్మాయిపేటలో 8.5, అల్గోల్‌లో 8.9, కడ్పల్‌లో 9.0, అన్నాసాగర్, జహీరాబాద్‌లో 9.1, సత్వార్‌లో 9.2, దిగ్వాల్‌లో 9.4, కల్హేర్‌లో 9.5, బీహెచ్‌ఈఎల్‌లో 9.6, మగ్దుంపల్లెలో 9.6, చౌటకూరు 9.8 డిగ్రీలు

మెదక్ జిల్లా.. శివ్వంపేటలో 8.0, బోడగట్ 9.4, భుజరంపేట, వాడిలో 9.6, దామరంచ, పెద్దశంకరంపేటలో 9.7, టేక్మాల్‌లో 9.8, నాగాపూర్‌లో 9.9 డిగ్రీలు

సిద్దిపేట జిల్లా.. పోతారెడ్డిపేటలో 8.6, నంగునూరు 9.1, హబ్సీపూర్ 9.7, అంగడికిష్టాపూర్ 9.9, మిరుదొడ్డి 10.0 డిగ్రీలు నమోదయ్యాయి.

చలి పంజా

- వణుకుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా
- కోహీర్‌లో 6.8 డిగ్రీలుగా నమోదు
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

మెదక్ అర్బన్/కోహీర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాపై చలి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చలి తీవ్రత పెరుగుతోంది. దాంతో జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్ 6.8 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రత నమోదు కాగా.. మెదక్ జిల్లా శివ్వంపేట 8.0 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతారెడ్డిపేట 8.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో పడిపోయాయి. ఉదయం పొగమంచు కమ్మేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కోహీర్ మండలంలో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. చలికి ఈదురుగాలులు తోడవడంతో వణికిపోయారు. ఉదయం 10 గంటలైనా ఇంట్లో నుంచి బయటికి రాలేదు. తప్పనిసరైనవారు స్వెటర్‌లు, మంకీ క్యాప్‌లు ధరించి బయటకు వెళ్లారు.



కోహీర్‌లో చలిమంట వేసుకున్న స్థానికులు



మెదక్‌లోని ఓ కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పరీక్ష సిబ్బంది



సంగారెడ్డిలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

తొలిరోజు ప్రశాంతం

గ్రూప్-2 పరీక్షకు సగం కంటే తక్కువ హాజరు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8.30 గంటల నుంచి, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం, మధ్యాహ్నం అరగంట ముందుగానే గేట్లు మూసివేశారు. ఇక అభ్యర్థులను క్షుణంగా పరిశీలించి అనుమతించారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉదయం నిర్వహించిన పేపర్-1కు 15,218 మంది అభ్యర్థులకు 7,359 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2కు 15,218 మందికి గాను 7,206 మంది హాజరయ్యారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్, పయనీర్స్, సెయింట పాఠశాల పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇలా ఉండగా సంగారెడ్డి శాంతినగర్‌లోని పరీక్ష కేంద్రానికి నలుగురు అభ్యర్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ట్రాఫిక్ ఉందని ఒకరిద్దరు, బస్సులు రాలేవన్న కారణంతో మరో ఇద్దరు ఆలస్యంగా కేంద్రానికి చేరుకున్నారు. వారిని అధికారులు లోనికి అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. నేడూ పరీక్ష కొనసాగనుంది.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లావ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించారు. ఉదయం 5,855 మంది అభ్యర్థులకు గానూ 2,868 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 5,855 మందికి గానూ 2,859 మంది హాజరయ్యారు. పట్టణంలో గీతా స్కూల్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి నిరాశతో వెనుదిగారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

మునిపల్లి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మునిపల్లిలో 60మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆదివారం మండల స్థాయిలో ఎంఈవో భీంసింగ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి గంధం మల్లికార్జున్, ఉపాధ్యాయులు రమణ తదితరులు విద్యార్థులను అభినందించారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుధాకర్ రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

హత్నూర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్పనూరులో శ్రీ పార్వతీ సహిత రాజరాజేశ్వరస్వామి ఆలయం వద్ద నూతన శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా జరిగాయి. చివరిరోజైన ఆదివారం ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఉత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

'హైడ్రా'తో కూల్చుడే తప్ప కట్టింది లేదు

- అల్లుఅర్జున్, లగచర్ల రైతుల అరెస్ట్‌తో హిట్‌వికెట్ అయిన రేవంత్
- రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకని దుస్థితి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ సైతం దొరకని రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రిగా నీ పనిఅయిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో ఆదివారం సాయంత్రం కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చతికిలపడిందన్నారు. హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తే ఫ్రస్ట్రేషన్‌తో రేవంత్‌రెడ్డి బూతుపురాణానికి దిగుతున్నారని విమర్శించారు. క్రికెట్‌లో హిట్ వికెట్ ఎలాగే ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి పరిస్థితి అదే విధంగా తయారైందన్నారు. అల్లుఅర్జున్‌ను అరెస్ట్ చేయించడం, లగచర్లలో రైతులకు బేడీలు వేయడం, దేవుళ్ల మీద ఒట్లు పెట్టి ప్రజలకు పంగనామాలు పెట్టడం ఇవన్నీ హిట్ వికెట్లే అని కాంగ్రెస్ పెద్దలకు తెలిసిపోయిందన్నారు. సీఎం నరుకుడు పుంజు అని తేలిపోయిందన్నారు. హైడ్రా పేరుతో కక్షసాధింపు కోసం కూల్చివేతలు తప్ప ఒక్కటైనా కట్టాడా అని నిలదీశారు. రేవంత్‌కు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకని దుస్థితి ఏర్పడిందన్నారు. పాలనకు ఏడాదైనా 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదన్నారు. అమలు కాని హామీలపై కాంగ్రెస్ నాయకులను, మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీయాలన్నారు. రైతుబంధు ఎగబెట్టిందని స్పష్టంగా అర్థమైందని హరీశ్‌రావు తెలిపారు. హామీల అమలుకు ప్రభుత్వం మెడలు వంచేందుకు వీధిపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని ఆయన కోరారు. తగిన గుణపాఠం నేర్పి హక్కులను సాధించుకుందామన్నారు. కేసీఆర్ టోర్నమెంట్ నిర్వహించిన యువనాయకుడు మాణిక్‌యాదవ్‌ను అభినందించారు. అనంతరం ఐలాపూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కార్పొరేటర్ కుమార్ యాదవ్, నాయకులు ఆదర్శరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సోమిరెడ్డి, కౌన్సిలర్ బాశెట్టికృష్ణ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

- పట్టుదల,కార్యదీక్షతో పనులు చేసుకోవాలి
- హైకోర్టు న్యాయమూర్తి టీ. మాధవిదేవి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి, తదితరులు

జహీరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కృషిచేయాలని హైకోర్టు న్యాయ మూర్తి టీ. మాదవిదేవి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పస్తాపూర్‌లో ఓ ఫంక్షన్‌హాల్‌లో వికాస్ కోల్ ఇండియా ఆర్థిక సహాయంతో మహిళా సశక్తీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని మాట్లాడుతూ వికాస్‌కోల్ ఇండియా ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా 180మంది మహిళలకు కుట్లు నేర్చుకునే విధానంపై శిక్షణకల్పించి, మిషన్లు కూడా అందజేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఇతరులపై ఆధారపడకుండా ఆర్థికంగ ఎదిగాలన్నారు. సమాజంలో అందరం నిత్య విద్యార్థులమేనని ఎంత నేర్చుకున్న, ఎంత తెలుసుకున్న తక్కువేనని గుర్తుచేశారు. అనంతరం వికాస్ సంస్థ చైర్మన్ కొత్తకాపు లక్ష్మారెడ్డి, హైదరాబాద్ రామక్రిష్ణమఠం సీనీయర్ ఫ్యాకల్టీ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డెరెక్టర్ ఆఫ్ జనరల్ డా. శ్రీనివాస్‌రఘు, తదితరులు మాట్లాడుతు సమాజంలో మనం ఎంతనేర్చుకున్న తక్కువేనన్నారు. ముఖ్యంగా మహిళల సౌకర్యార్థం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పలువురికి వారంత కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ గంకటి శుక్లవర్ధన్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డీనేటర్ కొత్తకాపు సురేందర్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మెకు మద్దతు తెలిపిన ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాబేర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్ మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత, తదితర సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం వారి సమస్యలు పరిశీలించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు హత్నూర ఎంఈవో వెంకట నర్సింహులు, మునిపల్లి పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దత్తు, ప్రధాన కార్యదర్శి అనీల్ చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్, నర్సింగ్, నాగరాజు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో జాతీయస్థాయికి అబ్దుల్ రెహమాన్ సిద్దిఖ్ ఎంపిక



సంగారెడ్డి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జయశంకర్ భూపాలపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాటర్ పోలో ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు సంగారెడ్డి నుంచి ఎండీ అబ్దుల్ రెహమాన్ సిద్దిఖ్, బాలికల విభాగంలో అలియా ఫాతిమా ఎంపికయ్యారు. ఈ నెల 27న విజయవాడలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలో వారు పాల్గొననున్నట్టు కోచ్ శేషుకుమార్ తెలిపారు. వారిని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, డివైఎస్‌వో ఖాసీం బేగ్, సిబ్బంది అభినందించారు.



108 వాహన సేవలను ప్రారంభిస్తున్న ఆవుల రాజిరెడ్డి

'108' వాహనం ప్రారంభం

మాసాయిపేట.డిసెంబర 15 .(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన 108 వాహన సేవలను ఆదివారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను చేపట్టి స్వల్పకాలంలో ప్రజాదరణ చూరగొందని తెలిపారు. మాసాయిపేటకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సైతం మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిష్టారెడ్డి, శ్రీకాంత్ నాగిరెడ్డి, శ్రీనివాస్, జగదీశ్, ధశరథ, గణేశ్, ఫకీరా గోపి నాయక్, తాజా మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వలకట్ల రమేశ్, డైరెక్టర్ నర్సింహులు, సిద్దిరాములు గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు : ఎమ్మెల్యే

నర్సాపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లా సమీక్ష సమావేశంలో వైద్యఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం వల్లే నియోజకవర్గంలోని కొల్చారం, వెల్దుర్తి మండలాలకు కొత్తగా 108 అంబులెన్సులు కేటాయించారని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాద ఘటనలను మంత్రి దామోదర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. వెల్దుర్తిలో కూడా అంబులెన్సు అవసరాన్ని తెలిపినందువల్లే రెండు మండల కేంద్రాలకు కేటాయించారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

కొల్చారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తెలిపారు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంతోమంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతూ మరణించడం, గాయాలబారిన పడుతుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం 108 అంబులెన్సులను ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల కాలంలో గత ప్రభుత్వం అంబులెన్సులను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. జిల్లా మంత్రి కొండా సురేఖకు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కొల్చారం మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సూచించడంతో వెంటనే మండలానికి అంబులెన్స్ మంజూరు చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

'కేవీకే'ను సందర్శించిన ఎస్పీ

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 15: ఈ నెల 25 న మండలంలోని తునికిలోని కేవీకే (కృషి విజ్ఞాన కేంద్రం)కు ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు రానున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదివారం కేవీకేను సందర్శించారు. హెలిప్యాడ్ దిగేందుకు , రైతులతో మాట్లడే సభ స్థలం పరిశీలన చేశారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి, కేవీకే అధికారులు రవి ఉన్నారు.



కేవీకేను సందర్శిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

స్మార్ట్‌ఫోన్ ఎవరిస్తారు..?!

● మీసేవా కేంద్రాల్లో 'క్యూఆర్ కోడ్' పే తప్పనిసరి
● స్మార్ట్‌ఫోన్ ఉంటేనే చెల్లింపులకు అవకాశం
● ప్రభుత్వ నిబంధనలతో నిరుపేదలకు చిక్కులు
● స్మార్ట్‌ఫోన్ లేకుంటే దరఖాస్తు చేసేందుకు నిరాకరణ!

బొబ్బిలిగామ గ్రామానికి చెందిన నర్సయ్య రెవెన్యూ రికార్డుల కోసం మీసేవా కేంద్రానికి దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లాడు. ఫీజును ఫోన్‌తో క్యూఆర్‌కోడ్ స్కానింగ్ చేసి చెల్లించాలని ఆపరేటర్ చెప్పడంతో స్మార్ట్‌ఫోన్ లేని నర్సయ్య అయోమయానికి గురయ్యాడు. ఎలాగైనా 'ఆన్‌లైన్' చేయమని ఆపరేటర్‌ను బతిమలాడినా.. అసహించుకుని పంపించాడు.

సదాశివపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మీసేవా కేంద్రాల్లో సేవలకు రుసుం వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో పే చేయడం తప్పనిసరి చేసింది. దీంతో గ్రామాల్లో ఇలాంటి నర్సయ్యలు ఊరురా కనిపిస్తారు. పేదరికం, నిరక్షరాస్యత కారణంగా ఖర్చుతో కూడిన స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే పరిస్థితి వీరికి లేదు. చాలా మంది వద్ద ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌కు బదులు తక్కువ ధరలో లభించే కీప్యాడ్ సెల్‌ఫోన్‌లు ఉంటే మరీ కొందరి వద్ద ఎలాంటి సెల్‌ఫోన్‌లు అందుబాటులో లేని పరిస్థితి ఉంది.

దరఖాస్తుకు నిరాకరణ..

మీసేవా కేంద్రాల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి పారదర్శకమైన ఫీజుల చెల్లింపుల ప్రక్రియను ప్రోత్సహించేందుకు క్యూఆర్‌కోడ్ ఆధారంగా చెల్లింపులను ఖచ్చితం చేసింది. దీంతో స్మార్ట్‌ఫోన్ లేని నిరుపేదలకు మీసేవా కేంద్రాల్లో ఫీజుల చెల్లింపు సమస్యగా మారింది. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా మాత్రమే చెల్లింపులు అంటూ నిరుపేదల సమస్యలు, దరఖాస్తులను పరిశీలించేందుకు మీసేవా కేంద్రాల నిర్వాహకులు పరోక్షంగా నిరాకరిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను చూపిస్తేనే నిరుపేదలు ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగలుగుతారు. దీనివల్ల అదనపు వసూళ్లు నిలిచిపోయాయనే భావనతో మీసేవా నిర్వాహకులు దరఖాస్తు చేసేందుకు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్మార్ట్‌ఫోన్ కలిగిన వ్యక్తులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు ఇతర ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ అంతరం రాకుండా మీసేవల్లోని అన్ని రకాల సేవలను నిరుపేదలకు సులువుగా లభ్యమయ్యేలా తగు చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.



స్మార్ట్‌ఫోన్ లేక ఇబ్బంది పడ్డాను



పట్టణంలో ఓ మీసేవా కేంద్రంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చాను. నాకు స్మార్ట్‌ఫోన్ లేకపోవడంతో మీ సేవా కేంద్రం వారు నా దరఖాస్తును 'ఆన్‌లైన్' చేయలేదు. ఎవరినీ బతిమాలిన ఫోన్‌పే చేసేందుకు సహకరించకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాను.

-తూర్పు రవీందర్, అనంతసాగర్, కొండాపూర్ మండలం

పారదర్శకత కోసమే క్యూఆర్‌కోడ్

సంగారెడ్డి జిల్లాలో 160 మీసేవా కేంద్రాల్లో 25 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 310 రకాల సేవలు పౌరులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని మీసేవా కేంద్రాల్లో పారదర్శకంగా ఫీజులు వసూళ్లు చేసేందు కోసమే క్యూఆర్‌కోడ్ అందుబాటులోకి తెచ్చాం. దీంతో పాటు ప్రతి కేంద్రంలో గమనిక బోర్డు, డిజిటల్ చార్ట్ విధిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రదీప్‌కుమార్, మీసేవా జిల్లా కార్యనిర్వాహణాధికారి

క్రైం కార్నర్

సైకిల్‌ను ఢీకొట్టి.. గుంతలో పడి..

● ద్విచక్రవాహనదారుడు మృతి

దుబ్బాక, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): బైక్‌తో సైకిల్‌ను ఢీకొట్టి గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపాలిటీ దుంపలపల్లి వార్డుకు చెందిన నర్మాల దేవయ్య(48) అక్బర్‌పేట-భూంపల్లి మండలం బేగంపేట గ్రామంలోని తన అత్తగారింటికి పెద్దజాతరకు వెళ్లాడు. ఆదివారం సాయంత్రం దుంపలపల్లికి తిరిగివస్తుండగా, ధర్మాజీపేట వార్డు శివారులోని దర్గవద్ద సైకిలిస్టును ఢీకొట్టి పక్కనే ఉన్న గుంతలో పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కళవ్వ, ముగ్గురు కూతుళ్లు కళ్యాణి, సమత, మమత ఉన్నారు. ఈ మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు..

మిరుదొడ్డి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన సంఘటన ఆదివారం మిరుదొడ్డిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన బొల్లస్వామి(35) ఆదివారం సాయంత్రం వ్యవసాయ పనులకు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య దేవరాణి, కూతురు మన్వీత ఉన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి

● చికిత్స పొందుతూ మృతి

కొండపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం వెలికట్ట గ్రామానికి చెందిన అమ్ముల యాదయ్య(55) రెండు సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన భార్య రేణుక అతడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి శనివారం రాత్రి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గుడిసె దగ్ధం.. రూ.లక్షన్నర ఆస్తి నష్టం



కాలిపోయిన వస్తువులు

కల్హేర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి తండాలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమై రూ.లక్షన్నర విలువగల ఆస్తినష్టం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాలో చెందిన వేముల నాయక్ పూరిగుడిసె వేసుకుని నివాసముంటున్నాడు. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి చోటుచేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గుడిసెలో ఉన్న నగదు, బంగారు, వెండి వస్తువులతో పాటు నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు ఆర్థికసాయం అందజేశారు. కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.





భక్తజనసంద్రం

కల్హేర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపల్లి, మాసాన్‌పల్లి గ్రామాల పరిధిలోని దేవునిగుట్టపై వెలసిన మల్లన్నస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ఉదయమే మాసాన్‌పల్లికి చెందిన గొల్ల, కురుమ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం కోసం భక్తులను అనుమతించారు. వేలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. గుట్ట చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వర్గల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్రూతలూగించింది. ఆదివారం 400 మంది విద్యార్థులు ఒకేచోట సమావేశమై రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడిపాడారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సరదాగా గడిపారు. నవోదయ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సంఘ సభ్యుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ అంచురి రమేష్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ పూర్వ విద్యార్థులంతా సంఘటిత తత్వాన్ని ఇలాగే కొనసాగించి నవోదయ విద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయినాథ్‌రెడ్డి, భాస్కర్, అరుణ, రాజు, బ్రహ్మం, భిక్షపతి, నిరూప పాటిల్, రఘు, పవన్‌కల్యాణ్, శ్రీనివాస్, శరత్, సాయి ప్రేమ్, శంకరయ్య, రవి, సూర్యప్రకాశ్, మల్లేష్, నరేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నేటి నుంచి పునశ్చరణ మహోత్సవాలు

● ముస్తాబైన చక్రియాల లక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయం



ఆలయం మహా మంటపం

పుల్‌కల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలోని అతి పురాతన శ్రీ లక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్నది. శివకేశవులు ఒకే గర్భగుడిలో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి 12 కిలో మీటర్ల దూరంలో గ్రామానికి పశ్చిమ భాగంలో మంజీర నది అంతర్భాగం (బ్యాక్ వాటర్)కు అంచున ఈక్షేత్రం ఉన్నది. ఉత్తర భాగంలో పెద్ద కోనేరు, చుట్టూ మంజీర జల సవ్వడులు, పచ్చని పర్యావరణం తివాచీ పరిచినట్లుగా అత్యంతం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం అలారారుతున్నది. అనంతపద్మనాభ స్వామివారు కాలసర్పంపై పడుకుని దర్శనమిస్తారు. ప్రజలు కులాలకతీతంగా ఊర్లో అంతా దేవుడి పేరు ఉచ్చరించేలా 'అనంత' అని నామకరణం చేసుకోవడం ప్రత్యేక విశిష్టతగా చెప్పవచ్చు.

విరాళాలు, ప్రభుత్వ నిధులతో..

విరాళాలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ సీఎం, ప్రస్తుత మంత్రి దామోదర రాజనరసింహ దేవాదాయ శాఖ ద్వారా ప్రత్యేక నిధులతో పురాతన ఆలయానికి పక్కనే కొత్తగా పరిపూర్ణ దేవాలయాన్ని నిర్మించుకున్నారు. 2013లో లక్ష్మీఅనంత పద్మనాభస్వామి, భవానీ రామలింగేశ్వర స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దాదాపు రూ.కోటిన్నర విరాళాలు సేకరించి మహా మంటపాన్ని నిర్మించారు. ప్రస్తుతం రామకృష్ణ శర్మ అర్చకుడిగా వ్యవహరిస్తున్నారు.

మూడురోజులపాటు ఉత్సవాలు..

శ్రీ లక్ష్మీఅనంత పద్మనాభస్వామి పునశ్చరణ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 18వ వరకు జరుగనున్నాయి. ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ప్రత్యేకంగా తయారు చేయించిన 42 ఫీట్ల ఎత్తు గల ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు.
మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హాజరుకానున్నారు.



అల్మాయిపేట శివారులోని మంజీరా నదిలోని ఓ బండపై మొసలి

మొసలి కలకలం

జోగిపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అందోలు మండలంలో మొసలి ప్రత్యక్షం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే... అల్మాయిపేట గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం నదిలో చేపల కోసం వలలను వేశారు. తిరిగి సాయంత్రం ఆ వలలను తీసేందుకు ప్రయత్నిస్తుండగా, నీటిలోని ఓ బండరాయిపై మొసలి కనిపించింది. దీంతో ఆ దృశ్యాలను మత్స్యకారులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు ఫారెస్ట్ అధికారులకు విషయం చేరవేశారు. ఇదిలా ఉండగా, మంజీరా నదిలో మొసళ్ల ప్రత్యక్షం కావడంతో పశువులు, గొర్రెల కాపరులు ఎవరూ నీళ్లలోకి వెళ్లొద్దని, జీవాలు, పశు సంపదను కూడా నీటిలోకి పోనివ్వొద్దని హెచ్చరించారు.

నత్తనడకన పనులు

● పూర్తికాని తూనికలు, కొలతల శాఖ భవన నిర్మాణం !
● వచ్చే ఏడాది మార్చి వరకు గడువు పొడిగింపు
● నిధులు మంజూరై ఏడేళ్లయినా ఇదే తంతు
● పాతికేళ్లుగా అద్దె భవనంలో ఆ శాఖ జిల్లా కార్యాలయం



సంగారెడ్డిలో నత్తనడకన కొనసాగుతున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా కార్యాలయ పనులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో నిర్మిస్తున్న జిల్లా తూనికలు కొలతల శాఖ కార్యాలయానికి నిధులు పుష్కలంగా ఉన్నా.. భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు నెమ్మదిగా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. ఫలితంగా సంబంధిత అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఉన్నతాధికారుల పట్టింపులేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భవనం కోసం రూ.50 లక్షలు మంజూరు

తూనికలు, కొలతల శాఖ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరు 29న రూ.50 లక్షలు మంజూరు చేసింది. సంగారెడ్డి బైపాస్‌రోడ్డులోని టీసీ స్టడీ సర్కిల్ పక్కన జీ+1 స్థాయిలో భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం 175 చ.గ.(1573 ఎస్ఎఫ్‌టీ) స్థలం కేటాయించింది. భవన నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తొమ్మిది నెలల్లో భవన నిర్మాణ పూర్తి చేస్తామని ఒప్పందం చేసుకున్నారు. 2024 మార్చి నిర్మాణం మొదలుపెట్టిన కార్పొరేషన్ ఈ లెక్కన నవంబరు(గత నెల) వరకు పూర్తి కావాల్సి ఉన్నా.. పూర్తి చేయలేదు.

అగ్రిమెంట్ గడువు పొడిగింపు

భవన నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా అలా జరగలేదు. దీంతో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అగ్రిమెంట్ గడువును వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించారు. ఆ లోగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని పేర్కొన్నారు. జీ+1 స్థాయిలో నిర్మించాల్సిన భవనం ప్రస్తుతానికి గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ వరకే పరిమితమైంది. ఈ క్రమంలో పెంచిన మరో మూడు నెలల గడువులో భవన నిర్మాణ పనుల పూర్తి కొంత సందేహాలకు తావిస్తున్నది.

అద్దె భవనంలోనే కార్యాలయం..

సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లో జిల్లా తూనికలు కొలతల శాఖ కార్యాలయం(జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీస్) పాతికేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఇందుకు నెల వారీ అద్దె రూ.5400 చెల్లిస్తున్నారు. ఓ వైపు కేంద్రం నిధులు మంజూరు చేసినా, స్థలం ఉన్నా పనులు వేగంగా కొనసాగించకపోవడంతో తూనికలు కొలతల శాఖ జిల్లా కార్యాలయం పాత భవనంలో కొనసాగించలేక తప్పని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైన కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



దౌల్తాబాద్: బాధిత కుటుంబానికి రూ.30 లక్షల బీమా చెక్కును అందజేస్తున్న తపాలా శాఖ అధికారులు

ప్రమాద బీమా.. కుటుంబానికి ధీమా..

● పోస్టాఫీస్‌లో తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం

దౌల్తాబాద్, డిసెంబర్15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలా మంది జీవితాలు అర్ధాంతరంగా ముగుస్తుండగా, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ముఖ్యంగా పేద మధ్యతరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు మరణిస్తే.. ఆ కుటుంబ సభ్యులను ఆదుకోవాడానికి ప్రభుత్వాలు కొన్ని ప్రమాద బీమాలు అమల్లోకి తెచ్చాయి. అందులో తపాలా శాఖలో ప్రమాద బీమా ఒకటి. తక్కువ ప్రీమియంతోనే రూ.10 లక్షలు రూ.15 లక్షల బీమా సౌకర్యం అందిస్తున్నది.

తక్కువ ప్రీమియంతో..

గ్రూప్ ఆక్సిడెంట్ గార్డు పాలసీ, పేరిట తపాలా శాఖ ఈ పథకాన్ని రెండేళ్ల క్రితం ప్రవేశ పేట్టింది. ఇందులో రెండు రకాల ప్రీమియాలు ఉన్నాయి. సంవత్సరానికి రూ.555 చెల్లిస్తే సంవత్సరం లోపు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు అందిస్తారు. రూ.755 చెల్లించి బీమా తీసుకుంటే రూ.15 లక్షల పరిహారం తపాలా శాఖ ద్వారా అందిస్తారు. ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం చెందితే రూ.15 లక్షలు అందజేస్తారు. ఆసుపత్రిలో చికిత్స కోసం కొంత డబ్బు ఇస్తారు. మృతుడి పిల్లల చదువులకు ఏడాదికయ్యే ఖర్చు అదనపు సాయంగా అందిస్తారు.

బీమా ఇలా పొందండి..

● ఈ బీమా తీసుకునేందుకు 18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు అర్హులు
● దగ్గరలోని పోస్టాఫీస్ బ్యాంకు వెళ్లి ఆధార్ కార్డు జీరాక్స్ అందించి, రూ.200 చెల్లించి ఖాతా తెరవాలి. వెంటనే సిబ్బంది క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డును అందజేస్తారు.
● అనంతరం రూ.555 లేదా రూ.755 చెల్లించి బీమా తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఏడాదిలో ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుంది.



ప్రమాద బీమా పాలసీ చేస్తున్న పోస్ట్ ఆఫీసర్ శంకర్

అర్హులందరికీ బీమా..

తపాలాశాఖ ద్వారా తక్కువ ప్రీమియంలో అందించే ప్రమాద బీమా పాలసీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు సిబ్బంది ద్వారా మా దొమ్మాట తపాలా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది బీమాలో చేరుతున్నారు. తపాలా కార్యాలయానికి వెళ్లి బీమా పొందాలి.

-కరికే శంకర్, దొమ్మాట తపాల శాఖ అఫీసర్

ప్రమాదకరంగా మూలమలుపులు



కుప్పానగర్ గ్రామ సమీపంలో మూలమలుపు, బోప్పన్‌పల్లి గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద పెరిగిన పొదలు

- పది కిలో మీటర్ల దూరంలో 8 మలుపులు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు
- కనిపించని సూచిక బోర్డులు
- కేతకీసంగమేశ్వర ఆలయానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ
- పట్టించుకోని అధికారులు

ఝరాసంగం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్- ఝరాసంగం ప్రధాన రహదారితో పాటు గ్రామీణ రోడ్లలో మూలమలుపులు వాహనదారుల పాలిట ప్రమాదకరంగా పరిణమించాయి. మూలమలుపులు ఉన్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, పెరిగిన ముళ్లపొదలను తొలగించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కానీ సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా..

మండల కేంద్రమైన ఝరాసంగం నుంచి మండల పరిధిలోని క్రిష్ణాపూర్ వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర 8 మూలమలుపులు ఉన్నాయి. ఈ రహదారి గుండా ప్రతి రోజూ జహీరాబాద్ పట్టణానికి వివిధ పనులు నిమిత్తం వాహనదారులు వేలాది సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. మండలకేంద్రమైన ఝరాసంగంలో శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం ఉండడం వల్ల కూడా కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఈ రోడ్డు గుండా అధిక సంఖ్యలో వస్తుంటారు. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు పలు మార్లు ప్రమాదాలు గురై జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మండల పరిధిలోని బోప్పన్‌పల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద విపరీతమైన ముళ్ల పొదలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు, ముళ్ల పొదలను తొలగించాలని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి, మైబూబ్

నారాయణఖేడ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి, మైబూబ్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో ఆదివారం మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు చేయడంలేదని, కనీస వేతన చట్టాలున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

చేగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల బీజేపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం జరగనుంది. స్థానిక ఐబీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించినున్న ఈ సమావేశానికి, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు చింత భూపాల్ తెలిపారు.

లేగదూడపై హైనా దాడి

కొండపాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం జప్తినాచారంలో లేగదూడపై హైనా దాడిచేసి చంపేసిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన మాన్తి పరశురాములు తన పొలం వద్ద కొట్టంలో పశువులను కట్టేశాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి లేగదూడ గాయాలతో చనిపోయి ఉన్నది. హైనా లేదా పులి చంపేసి ఉండవచ్చని భావిస్తున్నారు. లేగదూడపై దాడి జరగడంతో రైతులు, గ్రామస్థులు భయాందోళన గురవుతున్నారు.

డ్రగ్స్ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలి

- యాంటీ ఫర్ డ్రగ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు



కొండాపూర్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని యాంటీ ఫర్‌డ్రగ్స్ ఆర్గనేషన్ అధ్యక్షుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లో యాంటీ ఫర్ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా నిర్వహించిన 2కే రన్‌ను జెండా ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం దేశ భవిష్యత్‌కు ఆధారమైన యువత మాదకద్రవ్యాల వలలో చిక్కుకోకుండా ఉండాలనే ఉద్దేశంతో గ్రామాల్లో యాంటీ ఫర్ డ్రగ్స్ పేరుతో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బాల్‌రాజు, బైరయ్య పాల్గొన్నారు.

'గురుకులం' ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

చేర్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని సాంఘీక, సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల సందర్శనను అడ్డుకుని తమను అనుమతించకపోవడం పట్ల ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం పాఠశాల ప్రధాన గేటు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ చేర్యాల మండల ప్రధాన కార్యదర్శి యాసిన్ మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు వెళ్లిన తమను ప్రిన్సిపాల్ పుల్లయ్య అనుమతించకపోవడం తగదన్నారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందించడం లేదని, కనీస వసతులు కరువవడంతో తంటాలుపడుతున్నారన్నారు. కూరగాయలు, గుడ్లు, పండ్లు, వంట సామగ్రిని పక్కదోవపట్టిస్తూ విద్యార్థుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై హాస్టల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవినాశ్, అర్వింద్, నరేందర్, అభి పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

జగదేవ్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలంలో కొండపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సోషల్ మీడియాలో వైరల్‌పై అప్రమత్తం

- గురుకుల విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన అధికారులు



హాస్టల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ

కొండాపూర్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్మాపూర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శనివారం జరిగిన ఓ ఘటనకు సంబంధించి విద్యార్థుల మధ్య గొడవ అంటూ ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే స్పందించిన ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీఎస్పీ సత్యయ్యగౌడ్ ఇతర అధికారులు అప్రమత్తమై గురుకుల పాఠశాలను సందర్శించారు. శనివారం ముబారక్‌పూర్‌కు చెందిన ఓ విద్యార్థి పాఠశాల డార్మెంటరీ హాల్‌లో భద్రపరిచిన వస్తువుల బాక్స్(పెట్టె) తాళాలను పగులగొట్టిన తోటి విద్యార్థులు తినుబండారాలను, వస్తువులను దొంగిలించారు. ఈ విషయమై సదరు విద్యార్థి తమ తల్లిదండ్రులకు సమాచారమందించారు. అయితే అసలు విషయం మరుగున పడి సోషల్‌మీడియాలో మరో విధంగా వైరల్ అయ్యింది. జరిగిన ఘటనకు బదులుగా ఆదివారం ఉదయం హాస్టల్‌లో గొడవ, కొట్టుకున్న విద్యార్థులు.. హాస్టల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన అంటూ సోషల్ మీడియాలో ప్రచారం వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన ఆర్డీవో వెంటనే రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్యయ్య గౌడ్ పాఠశాలను సందర్శించి పర్యవేక్షించారు. తప్పుడు ప్రచార సమాచారంతో జరిగే పరిమాణాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దుష్ప్రచారాల వల్ల సమాజంలో అప్రతిష్ఠ పాలయ్యే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే గురుకులాలను, వసతి గృహాల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు మెనూ చార్జీలను పెంచి మరింత మెరుగైన సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వారి వెంట సీఐ వెంకటేశ్, ఆర్ఐ మహాదేవ్, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం



కోహీర్: మల్లన్న స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు

కోహీర్/మునిపల్లి/టేక్మాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల శ్రీ మల్లికార్జున స్వామి (సట్టి) జాతరలో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశం, స్వామివారికి అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయంలో గొల్ల బీర్ల వారిచే శ్రీ మల్లికార్జున స్వామి వారి జీవిత చరిత్ర, ఒగ్గు కథ నిర్వహించారు. రాత్రి 10 గంటల నుంచి ఆలయంలో భజన నిర్వహించారు. రాత్రి 11 గంటలకు స్వామివారి రథోత్సవ కార్యక్రమం భాజా భజంత్రీల మధ్య స్వామి వారి ఆలయం వరకు నిర్వహించారు జాతర సోమవారంతో ముగుస్తుంది. మునిపల్లి మండల పరిధిలోని పెద్దచెల్మెడ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు పైతర సాయికుమార్, మాజీ జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కాదులూర్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీమల్లికార్జున జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పాచి బండ్లను నిర్వహించారు.

ఘనంగా పులిమామిడి రాజు జన్మదిన వేడుకలు



అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షాధారులు

- పీఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, పీఎంఆర్ డెవలపర్స్ ఫౌండేషన్ చైర్మన్, సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడిరాజు జన్మదిన వేడుకలను ఆదివారం సదాశివపేట పట్టణంతో పాటు మండలంలో అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో పీఎంఆర్ యువసేన సభ్యులు రాగం అనీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప దీక్షధారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. అనంతరం అనీల్‌స్వామి మాట్లాడారు. ప్రజాదరణ పొందిన పులిమామిడిరాజు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలనిఆకాంక్షించారు. కార్యక్రమంలో నరేందర్, చింటూ, సాయి, సతీష్, రాము, అంజి, రాఘవేంద్ర. చిన్న, హరి, మైపాల్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీధర్



సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా సంగారెడ్డికి చెందిన చంద శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురై తుంకుమ్ కన్వెషన్ సెంటర్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ తరఫున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

హుస్నాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారత తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వివిధ సంస్థానాలను ఐక్యం చేసి దేశంలో సమైఖ్య స్ఫూర్తిని నింపిన ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బంక చందు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బిక్యానాయక్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో ఘనంగా అయ్యప్ప పడిపూజ

తూప్రాన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ అయ్యప్ప ఆలయంలో ఆదివారం నిర్వహించిన పడిపూజ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. వెల్దుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వంచ భూపాల్‌రెడ్డి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి, మాజీ మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గురుస్వాములు చిన్నలింగు శ్రీనివాస్‌గౌడ్, బజారు రుపేశ్, స్థానిక నాయకులు హాజరై పూజలు నిర్వహించారు.



పడిపూజలో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



తునికిలోని నల్ల పోచమ్మ ఆలయంలో భక్తుల పూజలు

కౌడిపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. అమ్మవారిని ఆలయ పూజారి శివప్ప అలంకరణ చేసి పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు, ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

దివ్యాంగుల పెన్షన్ల పెంపునకు దేశవ్యాప్తంగా ప్రచారోద్యమం



కేకే భవన్‌లో మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్ రూ.10 వేల పెంచాలని డిమాండ్ చేస్తూ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య తెలిపారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో ఆదివారం సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ధరల పెరుగుదలకనుగుణంగా దివ్యాంగులకు కనీస పెన్షన్ రూ.10వేలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. 2011 నుంచి పెన్షన్లలో కేంద్రం వాటా కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తుందని, నిత్యావసర సరుకుల ధరలు 300 రేట్లు పెరిగినా పెన్షన్ మాత్రం పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. ఫిబ్రవరి 10న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి బుక్క ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు పోచయ్య, నాగయ్య, నర్సింలు, రాంచందర్, కృపవరం, ఖలీల్, యాదులు, లక్ష్మణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

నర్సాపూర్,డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని 9వ వార్డులో ఉన్న వెంకటేశ్వరకాలనీలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కాలనీలో నెలకొన్న మురుగుకాలువ, మంచినీటి సరఫరా, సీసీరోడ్ల సమస్యలకు సంబంధించి చైర్మన్‌కు అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీతాబాల్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు చిన్నరమేష్‌గౌడ్, అశోక్‌గౌడ్, బుచ్యానాయక్,శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ సమాజం అధ్యక్షుడిగా మల్లన్న



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన చీల మల్లన్న, పిల్లోడి విశ్వనాథం

సదాశివపేట, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి): సదాశివపేట వీరశైవ సమాజం చౌకిమఠం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా 4వ సారి చీల మల్లన్న ఎన్నియ్యారు. ప్రధాన కార్యదర్శిగా రెండోసారి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, ప్రస్తుత 13వ వార్డు కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, కోశాధికారిగా 7వ సారి పులిమామిడి వీరేశం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సమాజం పెద్దలు బోడగామ శ్రీశైలం, ఉల్లిగడ్డల నాగన్న, కిరణ్, చందు స్వామి, నాగిశెట్టి, ఈశ్వర్, రాచన్న స్వామి, మహేష్ స్వామి, మల్లయ్య స్వామి, సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం.. అడ్డదారి

(5వ పేజీ తరువాయి)

ప్రతీ నెల అధికారులకు వాటాలు ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటిదాకా సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వని మిల్లర్లు కూడా ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. సర్కారు నుంచి వచ్చిన బియ్యం మళ్లీ సర్కారుకే చేరుతుంది.



వెల్దుర్తి: ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

నిఘా లోపమే శాపం

బియ్యం దందాను మొక్కగా ఉన్నపుడు తుంచడంలో అధికారులు, నిఘా వర్గాలు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. రేషన్ దుకాణాలవారీగా సివిల్ సప్లయ్ అధికారుల నిఘా కొరవడింది. 'రేసన్ బియ్యం కొంటాం' అంటూ బ్రోకర్లు గల్లీగల్లీ తిరిగి కొనుగోలు చేస్తున్నా అధికారులు కానీ, నిఘావర్గాలు కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రేషన్ షాపులను మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారని, బియ్యం నిల్వలపై కూడా ఆరా తీయడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా కిలోల్లో లబ్ధిదారులకు చేరిన బియ్యం టన్నుల్లో సరిహద్దులు దాటుతున్నది. జాతీయ రహదారులు విస్తరించిన బొడ్మట్‌పల్లి, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరముంది.



నర్సాపూర్‌లో బియ్యం తరలిస్తూ పట్టుబడిన ఆటో

ఆలయాల్లో ఘనంగా దత్తజయంతి



ఝరాసంగం: విద్యుత్‌దీపాలతో అలంకరించిన దత్తగిరి ఆశ్రమం, స్వామివారి డోలారోహణంలో భక్తులు

ఝరాసంగం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామంలో గల దత్తగిరి ఆశ్రమంలో ఆదివారం దత్తజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమాన్ని వివిధ రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. కార్యక్రమానికి కర్ణాటకతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆశ్రమఆవరణలో దత్తయజ్ఞం, చండీహోమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆశ్రమ ఆవరణలో దత్తాత్రేయుని డోలారోహణ కార్యక్రమం చేపట్టారు. ఆశ్రమపీఠాధిపతి వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహారాజ్, బావిపీఠాధిపతి డా.సిద్ధయ్యస్వామి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలను కల్పించారు.ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ బీబీపాటీల్ దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ఆశ్రమపీఠాధిపతి, ఉత్సవకమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

- చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద దత్త పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం గణపతి పూజ, దత్తాత్రేయ స్వామివారికి అభిషేకం, హోమాలను ఘనంగా నిర్వహించారు. భక్తుల భజన సంకీర్తనలు, కోలాటాల మధ్య స్వామివారి పల్లకి సేవ కొనసాగింది. అలాగే షిరిడి సాయిబాబా మందిరంలో అభిషేక పూజలు, నిర్వహించి సాయి పల్లకిని ఊరేగించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.
- టేక్మాల్: మండల పరిధిలోని పల్వంచ గ్రామంలోని మాణిక్య ప్రభు ఆలయంలో దత్త జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు చేపట్టారు.
- హత్నూర: మండల పరిధిలోని మాధుర గ్రామ శివారులో గల శ్రీ దత్తాచల క్షేత్రంలో జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఉదయం మూల విరాట్‌కు మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకాలు, మండప పూజలు చండీ పారాయణాలు, రుద్ర దత్త జపాలు, మండప హోమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ, బండ్ల ఊరేగింపు నిర్వహించగా పరిసర గ్రామాలతో పాటు హైదరాబాద్ ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
- తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని షిర్డీసాయి సేవా ట్రస్టులో ఆదివారం శ్రీదత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, కాకడ హారతి, మహా అభిషేకం, అష్టోత్తర పూజ, మహాగణపతిపూజ, శ్రీషిర్డీ సాయిబాబా పూజ, మధ్యాహ్న హారతి, భజన, మహా ప్రసాద వితరణ, రాత్రి పల్లకి సేవ ఊరేగింపు నిర్వహించారు.



చిన్నశంకరంపేట: అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద హోమం నిర్వహిస్తున్న దంపతులు